క్లుప్తంగా

వాహనాల వేలం

పీలేరు : పీలేరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో వివిధ సారా కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం వేయడం ద్వారా రూ. 70,918 ఆదాయం వచ్చినట్లు సెబ్ రాయచోటి సూపరింటెండెంట్ మధుసూదన్ తెలిపారు. శనివారం స్థానిక సెబ్ కార్యాలయం వద్ద 8 వాహనాలకు వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ధర రూ. 46,300 కాగా జీఎస్టీతో సహా రూ. 70,918 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. సెబ్ సీఐ గురుప్రసాద్, ఎస్‌ఐ లక్ష్మీనరసయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మంచి అలవాట్లతో బాల్యం భద్రం

పీలేరు : మంచి అలవాట్లతో బాల్యం భద్రంగా ఉంటుందని తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్ అన్నారు. శనివారం పీలేరు పట్టణం యల్లమంద క్రాస్ అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలతో జలుబు, జ్వరం, తల, వళ్లునొప్పులు లాంటివి వచ్చే అవకాశం ఉందన్నారు. పిల్లలకు తాజా ఆహారం, కాచి వడబోసి చల్లార్చిన శుభ్రమైన నీటిని తాపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు కుసుమ, ఏఎన్‌ఎం భార్గవి, సీహెచ్‌వో రాజేశ్వరి, ఉపాధ్యాయులు వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

31న అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు

మదనపల్లె సిటీ : పౌర్ణమి పురస్కరించుకుని ఈనెల 31న అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ డిపో -2 మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. అరు అల్ట్రా డీలక్స్ బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం అందుబాటులో ఉంచామన్నారు. మరిన్ని వివరాలకు 9959225677, 9160186645, 9000935897లను సంప్రదించాలని కోరారు.

కోరం లేకుండానే జనరల్‌బాడీ సమావేశం

కలికిరి : మండలంలోని పత్తేగడ గ్రామంలో శనివారం జరిగిన వీఓ-1 గ్రామ సంఘం సర్వసభ్య సమావేశం కోరం లేకుండానే నిర్వహించడంపై మహిళ సంఘం సభ్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సమావేశానికి హాజరైన ఏరియా కో-ఆర్డినేటర్ రూతు సంఘాల వారిగా హాజరును పరిశీలిస్తుండగానే ఓ వర్గం మహిళలు లేచి అందరూ హాజరయ్యారని గందరగోళం సృష్టించారు. వీఓ పరిధిలో 35ఎస్‌హెచ్‌జీలకు సంబంధించి 356 మంది సభ్యులు హాజరవ్వాల్సి ఉండగా 105 మంది మాత్రమే హాజరై, సమావేశంలో ఎజెండా చర్చ జరగనీయకుండా అడ్డుకున్నారని తెలిపారు. ఏకపక్షంలో వీఓ లీడర్ల ఎంపికకు టీడీపీ నాయకులు కుట్రలు పన్నారని ఎస్‌హెచ్‌జీల మహిళలు ఆరోపించారు.

డంపింగ్ యార్డుకు స్థలం కేటాయింపు

పీలేరు రూరల్ : పీలేరు గ్రామ పంచాయతీ డంపింగ్ యార్డుకు పది ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సూచనల మేరకు మండలంలోని ముడుపులవేముల పంచాయతీ సర్వే నెంబరు 1247/2, 1248లో పది ఎకరాల స్థలాన్ని రెవెన్యూ అధికారులకు డంపింగ్ యార్డుకు కేటాయించారని తెలిపారు. శనివారం సంబంధిత స్థలంలో జేసీబీలో చదును చేసే పనులు చేపట్టినట్లు చెప్పారు. దీంతో పంచాయతీ డంపింగ్‌యార్డు సమస్య తీరినట్లైందని తెలిపారు.

పౌష్టికాహారం పంపిణీ

పీలేరు రూరల్ : పీలేరు వాసవి క్లబ్ గ్రేటర్, వాసవికపుల్స్ సౌజన్యంలో టీబీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్‌లో భాగంగా పీలేరు టీబీ యూనిట్‌లో నాలుగో విడత పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్ మాట్లాడుతూ టీబీ వ్యాధిగ్రస్తులను ఆదుకోవడానికి దాతలు ముందుకురావడం అభినందనీయమన్నారు. వాసవిక్లబ్ గ్రేటర్ అధ్యక్షులు అరవింద్, వాసవికపుల్ అధ్యక్షులు మహీధర, సభ్యులు, టీబీ పర్యవేక్షకులు మోహన్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

న్యాక్ బృందం పరిశీలన

కురబలకోట : న్యాక్ (నేషనల్ అసిస్మెంట్ అక్రిడేషన్) నిపుణుల బృందం అంగళ్లులోని విశ్వం ఇంజినీరింగ్ కళాశాలను శుక్ర, శనివారాల్లో రెండు రోజుల పాటు వివిధ అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. వివిధ కోర్సులు, సదుపాయాలు, వసతులు, ల్యాబ్స్, విద్యా ప్రమాణాలు, క్యాంపస్, వనరులు, రవాణా సౌకర్యాలు, స్పోర్ట్స్ తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. విద్యా ప్రమాణాల పట్ల నిపుణుల బృందం సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆ కళాశాల చైర్మన్ ఎం. ప్రభాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ డి. రమణారెడ్డి వెల్లడించారు.

ఎస్సీ వర్గీకరణను సాధించుకుందాం

ములకలచెరువు : ఎస్సీ వర్గీకరణను సాధించుకోవడానికి మాదిగలు సిద్ధంగా ఉండాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం మండలానికి చెందిన దళిత నాయకులతో సమావేశం నిర్వహించారు. వచ్చే నెలలో తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో 30 లక్షల మంది మాదిగలతో తలపెట్టిన మహాసభను విజయవంతం చేయాలని కోరారు.

విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్
- ఎంపీ నిధులతో ట్రై సైకిల్స్, వీల్‌చైర్స్ పంపిణీ
- 1,057 లబ్ధిదారులకు రూ.1.20 కోట్ల పరికరాల అందజేత


బ్యాటరీ సైకిళ్లు అందుకున్న విభిన్న ప్రతిభావంతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా, ఎమ్మెల్యే చింతలరామచంద్రారెడ్డి తదితరులు

మదనపల్లె : నిరుపేద, విభిన్న ప్రతిభావంతులు నిరుత్సాహ పడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని జిల్లా కలెక్టర్ గిరీషా.పీఎస్, పీలేరు ఎమ్మెల్యే చింతలరామచంద్రారెడ్డి అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో అలీంకో సహకారం, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి నిధులతో విభిన్న ప్రతిభావంతులకు ట్రై సైకిల్స్, వీల్‌చైర్స్, బ్యాటరీసైకిల్, పలురకాల పరికరాలు అందజేశారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ గిరీషా, పీలేరు ఎమ్మెల్యే చింతలరామచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, ఏపీ దివ్యాంగుల సంక్షేమశాఖ చైర్‌పర్సన్ ముంతాజ్‌పఠాన్, ఆర్డీఓ ఎం.ఎస్.మురళి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్రప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి విశేషకృషి చేస్తోందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విభిన్నప్రతిభావంతులకు ఫోల్డింగ్ చైర్స్, బ్యాటరీ సైకిల్స్, హియరింగ్ ఎయిడ్స్ తదితర పరికరాలు అందించడం అభినందనీయమన్నారు. స్పందనలో చాలామంది విభిన్నప్రతిభావంతులు పరికరాల కోసం అర్జీలు అందిస్తున్న విషయాన్ని ఎంపీ మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించిన ఆయన జిల్లాలోని ప్రతిభావంతులందరికీ ట్రై, బ్యాటరీ సైకిల్స్ తన నిధుల నుంచి మంజూరు చేశారన్నారు. ప్రస్తుతం జిల్లాలో మొత్తం 1,057 మంది లబ్ధిదారులకు రూ.1.20కోట్ల విలువచేసే 1,682 పరికరాలను అందిస్తున్నామన్నారు. విభిన్న ప్రతిభావంతులు ఎవరికీ తక్కువ కాదని, లక్ష్యాన్ని ఎంచుకుని సాధన దిశగా ముందుకెళ్లాలని సూచించారు. ఎమ్మెల్యే చింతలరామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. నడవలేనివారికి, అంధులకు, వినికిడిలోపం ఉన్న అర్హులైన వారందరికీ రాష్ట్రప్రభుత్వం చేయూతనిస్తూ ట్రై, బ్యాటరీ సైకిళ్లు, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్లు అందించడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి వివిధ పథకాలు ప్రవేశపెట్టి పెద్దపీట వేశారన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి నిధులతో ప్రతిభావంతులకు పరికరాలు అందించడం అభినందనీయమన్నారు. అర్హులు ఎవరైనా ఉన్నట్లయితే వెంటనే దరఖాస్తు చేసుకున్నట్లయితే వీరందరికీ అవసరమైన పరికరాలు అందిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ పేదల ప్రభుత్వమని, వారి సంక్షేమం కోసం సీఎం జగన్ మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ప్రజాప్రభుత్వం పదికాలాల పాటు ఉండేటట్లు ప్రతి ఒక్కరూ తమ చల్లని దీవెనలు సీఎం జగన్‌మోహన్ రెడ్డికి అందజేసి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ కృష్ణకిషోర్, తహసీల్దార్ మహబూబ్‌చాంద్, వెలుగు వ్యవస్థాపకులు ఉదయ్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుపెట్టుకుని సాయం చేసిన ఎంపీ

కురబలకోట : చంద్రగిరి నియోజక వర్గం ఎర్రవారిపల్లెకు చెందిన దివ్యాంగుడు భువనేశ్వర్‌రెడ్డి నెల క్రితం కురబలకోటలో జరిగిన ఓ కార్యక్రమానకి హాజరై రాజంపేట ఎంపీ పెద్ది రెడ్డి మిధున్‌రెడ్డిని కలసి మూడు చక్రాల సైకిల్ కోరాడు. అప్పట్లో ఎంపీ ఇచ్చిన హామీ మేరకు శనివారం మదనపల్లెలో జరిగిన పంపిణీ కార్యక్రమంలో ఇతనికి అధికారులు మూడు చక్రాల సైకిల్‌ను అందజేశారు.

సేవకు సలాం



శభాష్ గౌతమి


ఇంటింటా ఫీవర్ సర్వే చేస్తున్న వలంటీర్ గౌతమి (ఫైల్)

వలంటీర్ వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు వార్డులో ప్రజలకు వలంటీరుగా సేవలందిస్తున్నారు గౌతమి. మదనపల్లె పట్టణం 32వ వార్డు పరిధిలోని ప్రశాంత్‌నగర్ వలంటీరుగా కె.గౌతమి 2019 నుంచి పని చేస్తున్నారు. డిగ్రీ పూర్తి చేసి సామాజిక సేవలు అందించాలన్న ఆశయంతో వలంటీరుగా చేరింది. అప్పటి నుంచి వార్డులోని ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. 2020లో కరోనా సమయంలో వార్డులో కోవిడ్ బాధితులకు నిత్యావసర సరుకులు అందజేయడంతో పాటు బాధితులకు మందులు పంపిణీ చేశారు. వెంకటలక్ష్మమ్మ అనారోగ్యంతో తిరుపతి ఆస్పత్రిలో చికిత్సలు పొందుతుంటే ఆస్పత్రికి వెళ్లి ఫించన్ అందించారు. ఇళ్లలేని వారి గుర్తించి వారికి ఇంటిపట్టాలు అందేలా చేసింది . ప్రభుత్వ పథకాలు గురించి ప్రజలు వివరిస్తున్నారు. ఆమె సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం మూడు సార్లు సేవారత్న అవార్డులు అందుకున్నారు.

– మదనపల్లె సిటీ

కూతురు కంటే ఎక్కువ



కరోనా సమయంలో బంధువులు కూడా ఇళ్లకు రావడానికి భయపడ్డాను. ఇలాంటి సమయంలో వలంటీరు గౌతమి కూతురు కంటే ఎక్కువగా సేవలు అందించారు. నవరత్నాల పథకాలు అర్హులను గుర్తించి అందరికి అందేలా చర్యలు తీసుకుంది. ఒకటోతేదీ రోజే అందరికి ఫించన్లు ఇస్తుంది.

-గోపాల్, సప్తగిరినగర్, మదనపల్లె

సీహెచ్‌ఓలు అంకితభావంతో పనిచేయాలి


మాట్లాడుతున్న డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్

మదనపల్లె : కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్ (సీహెచ్‌ఓ)లు అంకితభావంతో పనిచేయాలని జిల్లా జిల్లా జాతీయ ఆరోగ్యమిషన్ పర్యవేక్షణ అధికారి (డీపీఎంఓ) డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. సీహెచ్‌ఓ, ఎమ్.ఎల్.హెచ్.పిలకు రెండునెలలుగా వృత్తినైపుణ్యాలపై ఒకో బ్యాచ్‌కు ఆరురోజుల పాటు శిక్షణలో భాగంగా శనివారం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో రెండు నెలల పాటు ఒకో బ్యాచ్‌కు 40 మంది చొప్పున మొత్తం 370 మంది సీహెచ్‌ఓ, ఎమ్.ఎల్.హెచ్.పిలకు శిక్షణ ఇచ్చామన్నారు. ఇందులో కాలిన గాయాలు, రోడ్డుప్రమాద బాధితులకు చికిత్స, ఎమర్జెన్సీ మెడికల్ కేర్, గాయాలకు కట్లు కట్టడం, కుట్లు వేయడం, ఇంజక్షన్‌లు వేయడం, ఐ.వి.ఫ్లూయిడ్స్ ఎక్కించడం, ప్రాథమిక చికిత్స, పాముకాటు, కుక్కకాటులకు చికిత్స, ఇతర నర్సింగ్ సేవల్లో తర్ఫీదు ఇచ్చామన్నారు. సీహెచ్‌ఓలు ఇంతకుమునుపే బీఎస్సీ నర్సింగ్ చేసిన సమయంలో శిక్షణ పొంది ఉంటారని, మళ్లీ ఇప్పుడు మరింత లోతైన అవగాహన కల్పించడంతో పాటుగా క్లినికల్ మేనేజ్‌మెంట్‌లో సామర్థ్యం పెంపొందించడమే శిక్షణ ముఖ్య ఉద్దేశమన్నారు. ఎమర్జెన్సీ మెడికల్ కేర్‌లో భాగంగా సీపీఆర్ నిర్వహణ, పాముకాటుకు గురైన వారిని ప్రాణాపాయం నుంచి కాపాడటంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు శిక్షణలో ఇస్తామన్నారు. దీనికోసం విజయవాడలో శిక్షణ పొందిన వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో భాగంగా శిక్షణ పొందిన సీహెచ్‌ఓలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ ప్రసాద్‌రాజు, డాక్టర్.పాల్‌రవికుమార్, హరగోపాల్, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, సీనియర్ అసిస్టెంట్ గిరిధర్‌రెడ్డి, టీబీ సూపర్‌వైజర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహల్ సీహెచ్‌సీలో విజిలెన్స్ తనిఖీలు

కలికిరి : మండలంలోని మహల్ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని (సీహెచ్‌సీ) కడప రీజియన్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ టి.రెడ్డెప్ప ఆధ్వర్యంలో శనివారం తనిఖీ చేశారు. ఆసుపత్రి వైద్యాధికారులు, సిబ్బంది వివరాలు, ఓపీ వివరాలను నమోదు చేసుకున్నారు. మందుల స్టాకు, ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది కొరతపై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు వారు పేర్కొన్నారు. అసిస్టెంట్ జియాలజిస్ట్ శ్రీనివాసులు, ఏఈఈ కిశోర్, నాగేశ్వరరావు, సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రాట్యుటీ క్లెయిమ్ ఖరారుపై అభ్యంతరాలు తెలపండి

మదనపల్లె : కర్ణాటక హైకోర్టు లిక్విడేటర్ నుంచి మదనపల్లె స్పిన్నింగ్ మిల్లు వర్కర్స్‌కు గ్రాట్యుటీ క్లెయిమ్‌లకు సంబంధించిన బకాయి వివరాలు కార్మికుల చిరునామాలకు పోస్టులో వస్తాయని, వాటిని పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా తెలుపుకోవాలని యూనియన్ అధ్యక్షులు జే.వి.నరసింహమూర్తి, కోశాధికారి యం.వి.రమణారెడ్డి తెలిపారు. శనివారం మదనపల్లె స్పిన్నింగ్ మిల్స్ వర్కర్స్ యూనియన్ విడుదల చేసిన ఒక ప్రకటనలో.. స్పిన్నింగ్ మిల్లు మూతపడిన తర్వాత లిక్విడేషన్ అమలులో ఉన్నందున యూనియన్ అధ్యక్షులుగా కంపెనీ పిటిషన్ నెంబర్.495/2021 ప్రకారం కార్మికులకు రావాల్సిన బకాయిలపై లిక్విడేటర్‌కు పిటిషన్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అందులో గ్రాట్యుటీ, ఇంట్రెస్ట్, ఆరుసంవత్సరాల తదుపరి మొత్తం గ్రాడ్యువిటీ ప్రకారం క్లెయిమ్ పిటిషన్ ఇచ్చామన్నారు. ప్రతి కార్మికుడికి వారి సర్వీసు ఆధారంగా క్లెయిమ్ వస్తుందన్నారు. దీనికి సంబంధించి త్వరలో పోస్టుద్వారా క్లెయిమ్ ఖరారు వివరాలతో లిక్విడేటర్ నుంచి పోస్టులో పత్రాలు వస్తాయన్నారు. ఏవేని సవరణలు ఉంటే త్వరగా పరిశీలించుకుని రాతపూర్వకంగా తెలిపితే పరిష్కరించేందుకు వీలుంటుందన్నారు. క్లెయిమ్‌లకు సంబంధించిన సమస్యపై పిటిషన్ ఇచ్చిన వెంటనే స్పందించి, పరిష్కారానికి కృషిచేసినందుకు లిక్విడేటర్, ఆడిట్, ఆఫీస్ సిబ్బందికి యూనియన్ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

వలంటీర్లంటే టీడీపీకి వణుకెందుకు?


మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి

కలికిరి : వలంటీర్లు తమ ఓటు హక్కును పరిశీలించుకోవడానికి, తమ వారి ఓట్లు సరిచూసుకోవడానికి, మరణించిన వారి పేరు తొలగించడానికి, ఇతర మార్పులు చేర్పులకు బీఎల్‌ఓల వద్దకు వెళితే టీడీపీ నాయకులు ఎందుకు ఉలికిపడుతున్నారని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి ప్రశ్నించారు. వలంటీర్లు ఓటర్లుగా ఉండకూడదా అన్నారు. నియోజకవర్గంలోని కలికిరిలో వలంటీర్లు బీఎల్‌ఓ కేంద్రాల వద్ద కనిపించారని పచ్చమీడియా, టీడీపీ నాయకులు అనవర, అసత్య ఆరోపణలు చేయడంపై ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. వాస్తవానికి కొటాలలోని బీఎల్‌ఓ కేంద్రం వద్దకు అక్కడున్న సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఉద్యోగి కోసం వలంటీరు వచ్చినట్లు నిర్ధారణ అయిందన్నారు. నియోజకవర్గంలో టీడీపీ నాయకులు అధికారులను ఎడోరకంగా బెదిరింపులకు గురిచేసి తమ అదుపులో పెట్టుకోవాలని చూడటం పరిపాటిగా మారిందన్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికలలో టీడీపీ కేవలం 183 ఓట్లతో గెలుపొందగా, ఇప్పుడు ఒక్క పత్తేగడ పంచాయతీలోనే 3400 ఓట్లుంటే అందులో 300 ఓట్లు నకిలీ ఉన్నట్లు తమదృష్టికి వచ్చిందన్నారు. దీన్ని బట్టిచూస్తే నకిలీ ఓట్లతోనే గతంలో టీడీపీ గెలిచిందన్నారు. ఇలాంటి దొంగోట్లు విచారణలో బయటపడితే తొలగిస్తారని టీడీపీ నాయకులు ఉలికిపాటుకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు భోగేష్, నాయకులు ఓబులంపల్లి గాంధీ, వెంకటపతి, మల్లికార్జున, రామిరెడ్డి, ఖాదర్‌బాషా, బాలగంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక విద్యార్థులకు వరం


మాట్లాడుతున్న సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకులు అబ్దుల్‌ఘనీ


ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు హారిక

మదనపల్లె సిటీ : జగనన్న విద్యాకానుక విద్యార్థులకు వరమని సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకులు అబ్దుల్‌ఘనీ అన్నారు. శనివారం మదనపల్లె మండలం బసినికొండ, వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా జగనన్న కిట్లు విద్యార్థులకు చేరాయా? వాటిని విద్యార్థులకు ఏ మేరకు వినియోగిస్తున్నారు? షూ సైజ్‌లు సరిపోయాయా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని ఎంఈఓలతో సమావేశమయ్యారు. జగనన్న విద్యాకానుక పంపిణీ వాటి వినియోగాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రతి రోజూ యూనిఫాం ధరించి పాఠశాలకు వచ్చేలా చూడాలని కోరారు. ప్రభుత్వపరంగా విద్యార్థులకు అందజేసే అన్ని రకాల వస్తువులు, పాఠ్యపుస్తకాలను సకాలంలో అందేలా చూడాలని కోరారు. జగనన్న గోరుముద్ద, రాగిజావ నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు కరుణాకర్, చంద్రశేఖర్‌నాయక్, సమీవుల్లా, హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పఠాన్ మహమ్మద్‌ఖాన్, షరాఫత్‌అలీఖాన్ పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పేదలకు వరం

కలకడ : జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు గొప్పవరమని ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు హారిక అన్నారు. శనివారం మండలంలోని ముడియంవారిపల్లె, గంగాపురం పంచాయతీలలో ఆయా పంచాయతీల సర్పంచ్‌లు శాంతమ్మ, రామచంద్ర అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద్బంగా లబ్ధిదారులకు ఉచితంగా ధ్రువపత్రాలను అందజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో లక్షలాదిమంది అర్హులు వారికి అవసరమైన జనన, మరణ, కుల, ఆధాయ, బియ్యం కార్డులలో పేర్లు నమోదు, తొలగింపు వంటి 11 రకాల ధ్రువపత్రాలు ఉచితంగా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి, కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ సందీప్‌కుమార్, ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, రైతు సంఘం కార్యదర్శి కుమార్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శివ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల ప్రదాత సీఎం జగన్

పెద్దతిప్పసముద్రం : ప్రజల వద్దకే ప్రభుత్వ పాలనను తెచ్చి సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత జగనన్నకే సాధ్యమని ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, జేసీఎస్ కన్వీనర్ డ్రిప్ రమణ, వైస్ ఎంపీపీ శోభా, కన్వీనర్ సుబ్బరాం అన్నారు. శనివారం మండలంలోని కమ్మచెరువులో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్పంచ్ నరసమ్మ, ఎంపీటీసీ చేలూరు కాంతమ్మ, కోఆప్షన్ ఖాదర్‌వలితో పాటు స్థానిక నాయకుల సమక్షంలో ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి, డీటీ ధనంజనేయులు లబ్ధిదారులకు పలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

జగనన్న విద్యాకానుక కిట్ల పరిశీలన

రామసముద్రం : మండలంలోని మట్లవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇచ్చిన జగనన్న విద్యాకానుక కిట్లను శనివారం జిల్లా జేవీకే పరిశీలకులు అబ్దుల్ ఘనీ పరిశీలించారు. ఆయన పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన అనేక విద్యా పథకాలలో జగనన్న విద్యాకానుక పేద విద్యార్థులకు వరంలాంటిదని చెప్పారు. విద్యార్థులందరికీ జేవీకే సామగ్రి అందజేయడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా సీఎంవో కమ్యూనిటి మొబలైజింగ్ ఆఫీసర్ మాట్లాడుతూ జగనన్న విద్యాకానుకలో భాగంగా విద్యార్థులు ప్రతి రోజు యూనిఫాం, బూట్లతో బడికి వచ్చి బాగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎల్‌ఎస్‌వో చంద్ర, ఎంఈవో హేమలత, బాలసుబ్రమణ్యం, ఆశజ్యోతి, కుసుమ, ఆపరేటర్ అన్వేష్, సీఆర్‌పీలు దామోదర్ , హరి, రామాంజులు, సుధాకర్‌రెడ్డి, అనిత, నాగరాజు పాల్గొన్నారు.

యాసిడ్ అమ్మకాలకు లైసెన్స్ తప్పనిసరి

గుర్రంకొండ : పట్టణంలోని దుకాణాల్లో యాసిడ్ అమ్మకాలకు లైసెన్స్ తప్పనిసరి అని ఎస్‌ఐ దిలీప్ కుమార్ అన్నారు. యాసిడ్ ద్రావణం నిల్వ చేసుకోవడానికి భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్లో యాసిడ్ వినియోగం, విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, బాలికల పైన దుండగులు ప్రాణాంతకమైన యాసిడ్ చల్లడం వంటి తీవ్ర నేరాలకు పాల్పడుతున్నారన్నారు. యాసిడ్ విక్రయించేవారు వారు ఎక్కడ నుంచి యాసిడ్ కొనుగోలు చేస్తున్నారు.. ఎవరికి విక్రయిస్తున్నారో పూర్తి వివరాలు రికార్డులో నమోదు చేయాలన్నారు. యాసిడ్ అమ్మకాలకు తప్పనిసరిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. పరిమితికిమించి యాసిడ్ నిల్వచేసినా, మైనర్ బాలబాలికలలు, యువకులకు విక్రయించినా చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో దుకాణదారులు, పోలీసులు పాల్గొన్నారు.

ఆజాద్ ఉద్యమ స్ఫూర్తిని పుణికిపుచ్చుకోవాలి


మహనీయుల వేషధారణలో విద్యార్థులు

మదనపల్లె : మాతృభూమి కోసం ప్రాణత్యాగం చేసిన దేశం గర్వించదగ్గ వీరుడు చంద్రశేఖర్ ఆజాద్ అని, ఆయన ఉద్యమ స్ఫూర్తిని యువత పుణికిపుచ్చుకోవాలని వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా అన్నారు. శనివారం పట్టణంలోని నవచైతన్యభారతి పాఠశాలలో చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ మహబూబ్‌బాషా మాట్లాడుతూ..చంద్రశేఖర్ ఆజాద్ పోరాటస్ఫూర్తి నాటి స్వాతంత్య్ర సంగ్రామంలో ఎంతోమంది యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. 15ఏళ్ల వయస్సులోనే స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొని బ్రిటీష్ న్యాయమూర్తి ఎదుట నిర్భయంగా తనపేరు ఆజాద్, తన తండ్రిపేరు స్వాధీన్, ఇల్లు కారాగారం అంటూ నినదించిన మహనీయుడు చంద్రశేఖర్ ఆజాద్ అని పిల్లలకు గుర్తుచేశారు. విద్యార్థిదశలో ఇలాంటి మహనీయుల గురించి తెలుసుకోవడం, వారి జీవితచరిత్రలను అధ్యయనం చేయడంతో సమాజంపై చక్కటి అవగాహన కలిగి, మంచి వ్యక్తిత్వం, క్రమశిక్షణతో ఉన్నతస్థానాలకు చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. స్వాతంత్య్ర సంగ్రామ పోరాటయోధుల వేషధారణలో ప్రదర్శించిన చంద్రశేఖర ఆజాద్ నాటకప్రదర్శన పలువురి ప్రశంసలు పొందింది. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సంపత్‌కుమార్, ప్రిన్సిపాల్ మానస పద్మనాభుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజెన్స్ సమస్యలు పరిష్కరించాలని వినతి

మదనపల్లె సిటీ : సీనియర్ సిటిజెన్స్ సమస్యలు పరిష్కరించాలని ఏపీ సీనియర్ సిటిజెన్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.మునిగోపాలకృష్ణ వికలాంగుల,వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ కృష్ణకిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన్ను కలిశారు. రైల్వేలో రాయితీ పాసులు పునః ప్రారంభించాలని తెలిపారు. సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో పాటు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

హార్సిలీహిల్స్‌పై కలెక్టర్, ఎస్పీ

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిహిల్స్‌కు శనివారం రాత్రి పలువురు ప్రముఖులు విచ్చేశారు. చిత్తూరుజిల్లా కలెక్టర్ షన్మోహన్ హార్సిలీహిల్స్‌కు రాగా తహసీల్దార్ రఫీక్ అహ్మద్, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధరరావు కొండకు చేరుకొగా సీఐ శివాంజనేయులు, ఎస్‌ఐ రామమోహన్‌లు స్వాగతం పలికారు. సమాచార హక్కు చట్టం కమిషనర్ చెన్నారెడ్డి ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి, సీఐ శివాంజనేయులు, ఎస్‌ఐ రామమోహన్, టూరిజం మేనేజర్ నేదురుమల్లి సాల్విన్‌రెడ్డి స్వాగతం పలికారు.

అన్నదానం

వాల్మీకిపురం : అన్ని దానాల కన్నా అన్నదానం గొప్ప కార్యమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం పట్టణానికి చెందిన ప్రైవేటు పాఠశాల యజమాని రమణ ఐదు బస్తాల బియ్యాన్ని సాయినా రాయన సేవ ట్రస్టుకు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా దాతను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, క్రిష్ణమూర్తి, ఆనంద రెడ్డి, దాత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ పట్టాభిరామాలయంలో..

వాల్మీకిపురం : టీటీడీ ఆధ్వర్యంలోని స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో శనివారం పట్టణానికి చెందిన ఉపసర్పంచ్ కేశవ రెడ్డి దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల టీటీడీ ఆలయంలో భక్తుల కోసం నూతన కార్యక్రమాలను చేపట్టింది. విశేష దినాల్లో ఆలయంలో భక్తులు నిర్దేశించిన అనుమతులకు లోబడి అన్నదానం నిర్వహించుకోవచ్చునని తెలిపారు. ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, బివి రెడ్డి, టిటిడి సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.